రక్తదానం ప్రాణదానంతో సమానం

పోచారం: మున్సిపాలిటీ పరిధిలోని కాచవాని సింగారంలో హైదరాబాద్ యూత్ అసెంబ్లీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని కాంగ్రెస్ పార్టీ పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ అధ్యక్షుడు తుంగతుర్తి రవి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రక్తదానం ప్రాణదానంతో సమానమని, యువకులు రక్తదాన శిబిరాల్లో పాల్గొనాలని పిలుపునిచ్చారు. అనంతరం అవయవదానం చేసేందుకు ఆసక్తిగల దాతలతో రిజిస్ట్రేషన్లు చేయించారు. నిర్వాహకులు పల్లవి, విజయ్, గురుతేజ తదితరులున్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

జవహర్‌నగర్: ప్రతి ఒక్కరూ తమ ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని జవహర్‌నగర్ కార్పొరేషన్ కమిషనర్ వసంత అన్నారు. జవహర్‌నగర్ కార్పొరేషన్ 10వ డివిజన్‌లో డెంగీ కేసు నమోదు కాగా.. కమిషనర్ వసంత సిబ్బందితో కలిసి బుధవారం బాధితురాలి ఇంటికెళ్లి పరిసరాలను పరిశీలించారు. అనంతరం ఇంటి చుట్టూ.. హైపో క్లోరైడ్ ద్రావణాన్ని పిచికారీ చేశారు. ప్రతి ఒక్కరూ తమ ఇంటి చుట్టూ వర్షపు నీరు, చెత్తా,చెదారం నిల్వ ఉండకుండా తగిన జాగ్రత్తలు పాటించాలని సూచించారు. డెంగీపై ప్రజలు ఆందోళన చెందొద్దని, నివారణతోనే అరికట్ట వచ్చన్నారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ కృష్ణప్ప, ఎన్వీరాన్‌మెంట్ ఇంజినీరు సందీప్, ఆరోగ్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు సత్కారం

కీసర: దమ్మాయిగూడ శారదాంబ బ్రాహ్మణ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నాగారం సెరినిటీ స్కూల్‌లో పదోతరగతి ఫలితాల్లో ఉత్తమ మార్కులు సాధించిన 13 మంది విద్యార్థులను సత్కరించారు. ఈ సందర్భంగా స్కూల్ కరస్పాండెంట్ నోముల జంగిరెడ్డి మాట్లాడుతూ.. శారదాంబ బ్రాహ్మణ సేవా సంఘం చేస్తున్న పలు సేవా కార్యక్రమాలను కొనియాడారు. సంఘం ఆధ్వర్యంతో ప్రతిఏటా తమ పాఠశాల పిల్లలకు సాయం అందజేస్తూ.. విద్యార్థులను ప్రోత్సహించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. శారదాంబ బ్రాహ్మణ సంక్షేమ సంఘం అధ్యక్షులు రామకృష్ణ, ప్రధాన కార్యదర్శి కాజ గంగాధర్‌రావు, సభ్యులు రామ్మోహన్‌రావు, హన్మంతరావు, రంగారావు, సూర్యనారాయణమూర్తి, వేణుగోపాల్, శ్రీనివాస్‌గుప్తా, రాజేశ్వరి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పాత పట్టణంపై ప్రత్యేక దృష్టి సారించాలి

మేడ్చల్: వర్షాకాలంలో మేడ్చల్ పాత పట్టణంలో ప్రజలు రోగాల భారిన పడకుండా మున్సిపల్ కమిషనర్ నాగిరెడ్డి ప్రత్యేక దృష్టి సారించాలని ఎమ్మెల్యే మల్లారెడ్డి అన్నారు. మేడ్చల్ పట్టణ సమస్యలపై ఆయన బుధవారం ఉదయం కమిషనర్ నాగిరెడ్డితో ఫోన్‌లో మాట్లాడి పలు సూచనలు చేశారు. పాత పట్టణంలో అపరిశుభ్రత ఎక్కువగా ఉందని, తాను ఇటీవల పర్యటించిన సమయంలో చూశానని వర్షాకాలంలో రోగాలు సులువుగా వచ్చే అవకాశాలు ఎక్కువగా ఉన్నందున దృష్టి సారించాలన్నారు. నూతన పట్టణం కంటే పాత పట్టణంలో సమస్యలు ఎక్కువగా ఉన్నాయన్నారు. అన్ని చర్యలు తీసుకుంటామని కమిషనర్ నాగిరెడ్డి ఎమ్మెల్యేకు వివరించారు.

ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య



శామీర్‌పేట్: చెట్టుకు ఉరేసుకుని ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన బుధవారం శామీర్‌పేట పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. శామీర్‌పేట మండలం, లాల్‌గడి మలక్‌పేటకు చెందిన కొండి మల్లేష్ (57), ప్రైవేటు ఉద్యోగం చేస్తూ జీవిస్తున్నాడు. కాగా గత కొద్ది నెలలుగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఈ క్రమంలో 27న మధ్యాహ్నం బయటకు వెళ్తున్నానని కుటుంబ సభ్యులకు చెప్పి వెళ్లాడు. రాత్రైనా తిరిగి ఇంటికి రాలేదు. తెలిసిన చోట్ల వెతికినా ఆచూకీ లభించలేదు. బుధవారం ఉదయం అలియాబాద్ గ్రామంలోని నయారా పెట్రోల్‌బంక్ సమీపంలోని చెట్టుకు ఓ వ్యక్తి మృతదేహం వెలాడుతుందని పోలీసులకు సమాచారం అందింది. వారు ఘటనా స్థలానికి చేరుకుని విచారించగా.. మృతుడు కొండి మల్లేష్‌గా గుర్తించారు. మృతదేహానికి పంచనామా నిర్వహించి, అనంతరం గాంధీ ఆసుపత్రికి తరలించారు. కేసు దర్యాప్తులో ఉంది.

నేటి జైహింద్ ర్యాలీ, సభను విజయవంతం చేయండి

మల్కాజిగిరి: బాచుపల్లిలో నిర్వహించే జైహింద్ ర్యాలీ, సభను విజయవంతం చేయాలని, మల్కాజిగిరి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు నాయకులు, కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఆర్‌కేనగర్‌లో మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి మాట్లాడుతూ.. వీఎన్‌ఆర్ విజ్ఞాన జ్యోతి ఇంజినీరింగ్ కళాశాల నుంచి కేజీఆర్ కన్వెన్షన్ వరకు ర్యాలీ అనంతరం బాచుపల్లి కొలను గోపాల్‌రెడ్డి కన్వెన్షన్‌లో సభ జరుగుతుందన్నారు. అన్ని డివిజన్ల నాయకులు, కార్యకర్తలతో పెద్దఎత్తున తరలివెళ్తామన్నారు.

నాలా కబ్జాకు యత్నం

- మట్టితో నింపి గోడ నిర్మాణం
- నాలా మూసివేతతో వరద ముప్పు
- చర్యలకు వెనకడుగు వేస్తున్న ఇరిగేషన్ అధికారులు
- కబ్జాను అడ్డుకోవాలని స్థానికుల వినతి



ఘట్‌కేసర్‌లో నాలాపై మట్టి పోసి నిర్మించిన గోడ

ఘట్‌కేసర్: ప్రభుత్వ ఆదేశాలను అధికారులు గాలికొదిలేయడంతో ప్రజలకు ఇబ్బందులకు తప్పడం లేదు. నిబంధనలు కాదని నిర్మాణాలు చేపడుతున్న అధికారులు పట్టించుకోకపోవడంతో నీరు వెళ్లే దారి లేక ప్రమాదం ఏర్పడనుంది. నాలా కబ్జా యత్నంతో ప్రజలకు వరద ముప్పు తప్పేలాలేదు. ఇరిగేషన్ అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తుండటంతో కబ్జాదారులు నాలా కబ్జాయత్నం చేస్తున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. తాజాగా ఘట్‌కేసర్–ఎదులాబాద్ అండర్ పాస్ రోడ్డు సమీపంలో నాలాలో మట్టి నింపి గోడ నిర్మించారు. నాలా కబ్జాకు గురికాకుండా కాపాడాల్సిన అధికారులు ప్రేక్షకపాత్ర పోషిస్తుండటంతో అక్రమ నిర్మాణాలకు అడ్డూ అదుపు లేకుండా పోతోంది.

నాలాకు పొంచిఉన్న ప్రమాదం..

ఈడబ్ల్యూఎస్ కాలనీ, కొండాపూర్, నారాయణ గార్డెన్, గురుకుల్ సమీప ప్రాంతాల వర్షం నీరు వంపుగా ఉన్న ఎరిమల్లె వాగులో కలవడానికి దశాబ్దాల క్రితం రోడ్డుపై నాలా నిర్మించారు. సదరు ప్రాంతం అభివృద్ధి చెందడంతో పలు ఇళ్లను నిర్మించారు. వర్షం నీరు, మురికి నీరు పారేందుకు నిర్మించిన నాలాపై ఇటీవల కొందరు మట్టి పోసి అడ్డుగా గోడ నిర్మించారు. నిర్మాణం పూర్తయితే నాలా మూసుకుపోయి వరద నీటితో ఇళ్లలోకి వరద చేరే ప్రమాదం ఉందని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మూడు, నాలుగేళ్లుగా వర్షాకాలంలో కుండపోత వర్షం కురిసి నాలాలు నిండి రోడ్లన్నీ ధ్వంసం అయ్యాయి. రెవెన్యూ, పోలీస్, మున్సిపల్ అధికారులు ప్రయాణించే దారితో నాలాపై అక్రమ నిర్మాణాలు కొనసాగుతుంటే అధికారులకు కనిపించడం లేదా అని ప్రశ్నిస్తున్నారు.

రోడ్డుపై వరద నీరు..

వరద నీరు వెళ్లే నాలాలో కొందరు మట్టితో నింపి నీటి ప్రవాహానికి అడ్డుకట్ట వేసేందుకు గోడ నిర్మించారు. నాలా కబ్జా కారణంగా భారీ వర్షం కురిసినప్పుడు నీరు వెళ్లే దారి లేక ఇళ్లలోకి వరద చేరడంతో పాటు రోడ్డుపై నీరు పారుతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నాలాపై మట్టి పోసి గోడ నిర్మించినా సంబంధిత ఇరిగేషన్ అధికారులు పట్టించుకోకపోవడం అనుమానాలకు తావిస్తోంది. గోడ నిర్మాణంపై స్థానికులు గతంలో మున్సిపల్ కమిషనర్‌కు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదు. నాలా కబ్జా యత్నం పనులు నిలిపివేయాలని, లేనిపక్షంలో పనులు ముందుకు సాగే ప్రమాదముందని అంటున్నారు. గతంలో వరద ఎక్కువై మండల విద్యాధికారి కార్యాలయం పక్కన ఉన్న కల్వర్టు, తెగి రోడ్డు కొట్టుకుపోయింది. చేతులు కాలాక ఆకులు పట్టుకుంటే ఒరిగేదేమీ లేదన్న అభిప్రాయాన్ని స్థానికులు వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఇరిగేషన్ అధికారులు స్పందించి నాలాపై పోసిన మట్టిని, నిర్మించిన గోడను తొలగించాలని, వరద ముంపు నుంచి ప్రజలను కాపాడాలని కోరుతున్నారు.

నాలాపై నిర్మాణాన్ని తొలగిస్తాం..



నాలాపై మట్టి నింపి నిర్మించిన గోడ విషయమై రెవెన్యూ, మున్సిపల్ కమిషనర్ అధికారులకు లేఖ పంపుతాం. వారితో కలిసి నాలా కబ్జాను గుర్తిస్తాం. నిజమని తేలితే నిర్మించిన గోడను తొలగిస్తాం. నాలాపై మట్టి పోసి కబ్జాకు యత్నిస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకుంటాం.

– పరమేశ్, ఏఈ ఇరిగేషన్ ఘట్‌కేసర్

24 గంటల్లో రైతులకు ధాన్యం డబ్బులు

పౌరసరఫరాశాఖ జిల్లా మేనేజర్ సుగుణబాయి



వివరాలు తెలుసుకుంటున్న మేనేజర్ సుగుణబాయి

ఘట్‌కేసర్: అన్నదాతల నుంచి కొనుగోలు ధాన్యం డబ్బులు 24 గంటల్లో వారి ఖాతాల్లో జమచేస్తామని పౌరసరఫరాశాఖ జిల్లా మేనేజర్ సుగుణబాయి అన్నారు. మాదారం, ఏదులాబాద్ ధాన్యం కొనుగోలు కేంద్రాలను బుధవారం పరిశీలించి రికార్డులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కొనుగోలు కేంద్రాల్లో సరిపోను హమాలీలను ఏర్పాటు చేసుకోవాలని, కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలన్నారు. తూకం వేసిన వెంటనే మిల్లుకు పంపించాలన్నారు. తూకం యంత్రాలు, టార్పలిన్లు, తేమ మీటర్లు అందుబాటులో ఉంచుకోవాలని ఆదేశించారు. రైతుల దిగుబడి కొనుగోలు వెంటనే ఆన్‌లైన్ చేయాలని సూచించారు.

పొంచి ఉన్న ప్రమాదం !



ప్రమాదకరంగా డ్రైన్ పైకప్పు

బోడుప్పల్: రా చెరువు నుంచి దిగువ ప్రాంతానికి వర్షపు, మురుగునీరు వెళ్లేందుకు ఏర్పాటు చేసిన బాక్స్‌డ్రైన్ పైకప్పు పగిలిపోయింది. దీనికి మరమ్మతులు చేపట్టకుండా ఓ నాపరాయిని మూతగా పెట్టారు. 10 అడుగుల లోతులో ఈ డ్రైన్ ఉంది. ఇదే రోడ్డుపై వాహనదారులు, పాదచారులు ప్రతిరోజు వెళ్తుంటారు. చిన్నారులు సైతం క్రికెట్ ఆడుతూ.. అనుకోకుండా ఏదైనా ప్రమాదం జరిగే అవకాశం ఉంది. అధికారులు మరమ్మతులు చేపట్టి సమస్యను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

మండల పరిషత్ భవనంలోకి మున్సిపల్ కార్యాలయం



మున్సిపల్ కార్యాలయం ఆవరణలో ఉద్యోగులు, సిబ్బందితో ఇన్‌చార్జ్ కమిషనర్ భాస్కర్‌రెడ్డి

ఘట్‌కేసర్: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలోకి మున్సిపల్ కార్యాలయం బుధవారం మారింది. ఓఆర్‌ఆర్‌లో బయట ఉన్న మండలంలోని గ్రామాలను మున్సిపాలిటీల్లో విలీనం చేయడంతో ఇప్పటి వరకు గ్రామాల అభివృద్ధికి కేంద్రమైన ఈ భవనాన్ని మండల పరిషత్ సిబ్బంది ఇటీవల ఖాళీ చేశారు. పట్టణంలో ఉన్న మున్సిపల్ కార్యాలయం ఇళ్ల మధ్య ఇరుకుగా ఉండటంతో అధికారులు విధులు నిర్వహించడానికి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గ్రామాలు మున్సిపాలిటీలో విలీనమైన తర్వాత వివిధ పనుల నిమిత్తం కార్యాలయానికి వచ్చే ప్రజల వాహనాల పార్కింగ్‌కు ఇబ్బందిగా మారింది. ఉన్నతాధికారులు మండల పరిషత్ భవనాన్ని మున్సిపల్ అధికారులకు అప్పగించడంతో మున్సిపల్ ఇన్‌చార్జ్ కమిషనర్ భాస్కర్‌రెడ్డి మున్సిపల్ సిబ్బందితో నూతన భవనంలోకి మారారు. ఆవరణలో ఉన్న గాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. రెవెన్యూ అధికారి కవిత, మేనేజర్ వేణుగోపాల్‌రెడ్డి, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

హైడ్రాకు ఏకశిలానగర్ సమస్య !



సమావేశంలో మాట్లాడుతున్న అసోసియేషన్ అధ్యక్షుడు శివారెడ్డి

పోచారం: మున్సిపాలిటీ పరిధిలోని ఏకశిలానగర్ వెంచర్ సమస్య హైడ్రా అధికారుల దృష్టికి చేరిందని ఏకశిలానగర్ ప్లాట్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు చెరుకు శివారెడ్డి అన్నారు. బుధవారం ఏకశిలాగర్‌లోని అసోసియేషన్ ఆఫీస్ వద్ద ప్లాట్ ఓనర్స్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. హైకోర్టు ఆదేశానుసారం సర్వే నెంబర్లు 739 నుంచి 749 వరకు ఉన్న భూమిలో ఏర్పాటు చేసిన ఏకశిలానగర్ వెంచర్‌లో ఎలాంటి సర్వే నిర్వహించే వీలులేదన్నారు. ఈ సర్వే నెంబర్లలో వ్యవసాయభూమి లేకపోవడంతో రెవెన్యూ అధికారులు సర్వే చేపట్టారన్నారు. కొందరు వ్యక్తులు అక్రమంగా ప్లాట్ల హద్దు రాళ్లను తొలగిస్తున్నారని ఆరోపించారు. ఇలాంటి వ్యక్తులపై చట్టరీత్యా క్రిమినల్ కేసులు నమోదు చేయిస్తామని హెచ్చరించారు. ఇదే వెంచర్‌లో 7 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న ప్లాట్లు, రోడ్లను నలుగురు వ్యక్తులు కబ్జా చేసి కాంపౌండ్ వాల్ కట్టారని, ఈ విషయాన్ని హైడ్రా అధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో వారు క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కరిస్తామని హామీ ఇచ్చినట్లు చెప్పారు. న్యాయం ప్లాట్ ఓనర్ల పక్షానే ఉందని స్పష్టం చేశారు. అడ్వకేట్ జుబేర్, అసోసియేషన్ ప్రతినిధులు యాదగిరి, శ్రీనివాస్, ప్లాట్ల యజమానులు పాల్గొన్నారు.

రాజీవ్ రహదారిపై స్పెషల్ డ్రైవ్

లారీల కొరతతో కొనుగోలు కేంద్రాల్లో నిలిచిపోయిన ధాన్యం

శామీర్‌పేట్: రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తరలించడానికి లారీలు అందుబాటులో లేకపోవడంతో జిల్లా పౌరసరఫరా శాఖ, మేడ్చల్ ఆర్టీఏ అధికారులు శామీర్‌పేట పోలీస్‌స్టేషన్ ఎదురుగా స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. దాన్యం కొనుగోలు కేంద్రాల్లో బస్తాలను రైస్ మిల్లులకు చేరవేసేందుకు లారీలు రావడం లేదని, సెంటర్ ఇన్‌చార్జ్‌లు, అధికారులు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడంతో స్పందించిన సీఎం రేవంత్‌రెడ్డి జిల్లా పౌరసరఫరాశాఖ, జిల్లా ఆర్టీఏ అధికారులను లారీలు సమకూర్చాలని ఆదేశించారు. దీంతో రంగంలోకి దిగిన అధికారులు శామీర్‌పేట పోలీస్‌స్టేషన్ ఎదురుగా లారీలను ఆపి ధాన్యం కొనుగోలు కేంద్రాలకు తరలించారు. ఉమ్మడి శామీర్‌పేట్‌లోని శామీర్‌పేట, అలియబాద్, జగ్గంగూడ, కేశవరం, ఉద్దమర్రి, లక్ష్మాపూర్‌లలోని ఐకేపీ సెంటర్లకు లారీలను తరలించనట్లు అధికారులు వివరించారు.

స్కూల్ స్థలాన్ని ట్యాంక్ నిర్మాణానికి కేటాయించొద్దు !



తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న బీఆర్ఎస్ నేతలు

మేడ్చల్: పట్టణంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో ఓవర్‌హెడ్ వాటర్ ట్యాంక్ నిర్మాణానికి స్థలం కేటాయించొద్దని పట్టణ బీఆర్ఎస్ నాయకులు తహసీల్దార్‌ను కోరారు. బుధవారం తహసీల్దార్ కార్యాలయంలో ఇన్‌చార్జ్ తహసిల్దార్ సునీల్‌కుమార్‌ను నాయకులు వీరభద్రారెడ్డి, మల్లికార్జునస్వామి, నాగేందర్‌లు వినతి పత్రం అందజేశారు. ఇప్పటికే ట్యాంక్‌కు నిధులు మంజూరు కావడంతో మున్సిపల్ అధికారులు ఆదరాబాదరగా పాఠశాల ఆవరణలో ట్యాంకు నిర్మాణం చేయాలని, స్కూల్ స్థలాన్ని ప్రతిపాదించారని దానిని రద్దు చేసి మరోచోట నిర్మించాలని కోరారు. గతంలో పేద పిల్లల చదువు కోసం స్కూల్ కోసం స్థలాన్ని విరాళంగా ఇచ్చారని, స్కూల్ స్థలాన్ని పిల్లల కోసమే కేటాయించి ట్యాంకు నిర్మాణానికి మరోచోట స్థలం కేటాయించాలని విజ్ఞప్తి చేశారు.

మహిళ అదృశ్యం



రాణి

జవహర్‌నగర్: ఓ మహిళ అదృశ్యమైన ఘటన జవహర్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. దేవేందర్ నగర్‌లో నివసించే అక్షయ్, భార్య రాణి (20) కుటుంబసభ్యులతో కలిసి ఉంటున్నారు. ఈనెల 27న భార్యభర్తల మధ్య గొడవతో మనస్థాపం చెందిన భార్య ఇంట్లో ఎవరికీ చెప్పకుండా బయటకు వెళ్లి తిరిగి రాలేదు. ఆచూకీ వెతికినా లభించకపోవడంతో భర్త పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గంజాయి విక్రయిస్తున్న నలుగురి రిమాండ్

ఉప్పల్‌లో 13.541 కిలోలు స్వాధీనం



పోలీసుల అదుపులో నిందితులు

ఉప్పల్: ఉప్పల్ ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో గంజాయి విక్రయిస్తున్న నలుగురిని పోలీసులు అదుపులోకి తీసుకున్న ఘటన బుధవారం చోటు చేసుకుంది. ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ ఓంకార్ తెలిపిన వివరాల ప్రకారం.. మల్లాపూర్, నాచారం పరిధిలో కొందరు గుట్టు చప్పుడు కాకుండా గంజాయిని విక్రయిస్తున్నారనే పక్కా సమాచారంతో ఎక్సైజ్ పోలీసులు కాపుకాసి నిందితులను మల్లాపూర్ పారిశ్రామికవాడలో అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి 13.541 కిలోల గంజాయి, 4 సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. కరీంనగర్ ప్రాంతానికి చెందిన పరకాల వినయ్‌గౌడ్, అదే ప్రాంతానికి చెందిన నేరెళ్ల సనీలగౌడ్, యాదాద్రి ప్రాంతానికి చెందిన స్వర్ణం అమర్‌నాథ్, పానుగంటి నిఖిల్‌లు ముఠాగా ఏర్పడి ఒడిశా నుంచి కిలోకు రూ.3000లకు తీసుకొచ్చి, కిలోకు రూ.10,000ల చొప్పున విక్రయిస్తున్నామని నిందితులు అంగీకరించినట్లు చెప్పారు. ఈ మేరకు కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు.

భారత ఆర్మీకి విరాళం



అల్వాల్: ఓల్డ్ అల్వాల్ వజ్రా ఎన్‌క్లేవ్‌కు చెందిన మధ్యతరగతి మహిళ సింగంశెట్టి అనురాధ దేశభక్తితో 'ఆపరేషన్ సిందూర్' సందర్భంగా ప్రాణాలను అర్పించిన భారత సైనికుల వీరత్వానికి గౌరవంగా భారత ఆర్మీకి రూ.10 లక్షలు విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా బుధవారం తెలంగాణ అండ్ ఆంధ్ర సబ్ ఏరియాకు చెందిన సీనియర్ ఆర్మీ అధికారులు బృందాధిపతి నంజుండేశ్వర, ఎస్.వీ.కర్నల్ సురేష్‌గౌడ్‌లకు డ్రాఫ్ట్ రూపంలో అనురాధ అధికారికంగా అందజేశారు. అనంతరం ఆర్మీ అధికారులు అనురాధను అభినందించారు.

ప్రభుత్వ స్థలంలో దహన సంస్కారాలు

- అడ్డుకున్న సమీప కాలనీవాసులు
- పాత గ్రామ ప్రజలు దాడిచేశారని ఆరోపణ



కోర్టు కాపీలను చూపుతున్న కాలనీవాసులు

పోచారం: ఇస్మాయిల్‌ఖాన్‌గూడలోని వసంతవ్యాలీ, జయానగర్, గోకులం, వేంకటేశ్వరకాలనీల మధ్య ఉన్న 28 గుంటల ప్రభుత్వ భూమిలో కోర్టు ఆదేశాలను దిక్కరిస్తూ.. దహన సంస్కార కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని వసంతవ్యాలీ కాలనీ ప్రతినిధి సోమరాజు అన్నారు. బుధవారం సదరు స్థలంలో మృతదేహానికి దహన సంస్కారాలు నిర్వహించేందుకు ఇస్మాయిల్‌ఖాన్‌గూడ పాత గ్రామ ప్రజలు ఏర్పాట్లు చేస్తుండగా.. సమీప కాలనీవాసులు అడ్డుకున్నారు. దీంతో వారు కాలనీవాసులపై దాడి చేశారు. సోమరాజు మాట్లాడుతూ.. సర్వేనెంబర్లు 71, 75లోని ప్రభుత్వ భూమిలో ఎలాంటి కార్యకలాపాలు నిర్వహించొద్దని హైకోర్టు ఆదేశాలు జారీచేసినప్పటికీ కొందరు వ్యక్తులు మృతదేహాలకు అంతిమ సంస్కారాలు నిర్వహిస్తున్నారన్నారు. ఖాళీ స్థలాన్ని పబ్లిక్ పార్కుగా అభివృద్ధి చేయాలన్నారు. గ్రామ ప్రజల కోసం ప్రత్యేకంగా శ్మశానవాటిక ఉన్నా.. కాలనీకి సమీపంలోని ప్రభుత్వ భూమిలో మృతదేహాలకు దహన సంస్కారాలు నిర్వహించడం సరి కాదన్నారు.

రైల్వే ట్రాక్ అడ్డంకిగా ఉండటంతోనే..

ప్రభుత్వం కేటాయించిన శ్మశానవాటికలోకి వెళ్లేందుకు రైల్వేట్రాక్ అడ్డంకిగా ఉండటంతో కొత్తగా ఏర్పడిన కాలనీలకు సమీపంలో ఉన్న ప్రభుత్వ స్థలంలోనే మృతదేహాలను దహనం చేయాల్సివస్తోందని గ్రామస్తులు చెబుతున్నారు. సమస్యను పరిష్కరించాలని కలెక్టర్‌తో పాటు మున్సిపల్, రెవెన్యూ, పోలీసు అధికారుల దృష్టికి కాలనీవాసులు తీసుకెళ్లారు. ఇదిలా ఉండగానే అదే స్థలంలో దహనసంస్కారాలు నిర్వహించారు.

యువ వికాసం ఎందరికి ఆమోదం ?

అర్హులకు జూన్ 2న సాయం అందించాలని ప్రభుత్వం నిర్ణయం

- అర్హుల జాబితాను సిద్ధం చేస్తున్న సంబంధిత అధికారులు
- యువ వికాసం కింద మంజూరైన యూనిట్లు 24,610
- అన్ని వర్గాల ప్రజల నుంచి వచ్చిన దరఖాస్తుల సంఖ్య 66,648

మేడ్చల్, మల్కాజిగిరి జిల్లాలో కార్పొరేషన్ల వారీగా వచ్చిన దరఖాస్తుల వివరాలు

కార్పొరేషన్	దరఖాస్తులు	యూనిట్లు
ఎస్సీ	16,300	6,201
ఎస్టీ	2,196	1,594
బీసీ సంక్షేమ శాఖ	37,935	13,400
ముస్లిం, క్రిస్టియన్ మైనార్టీ	10,217	3,415

సాక్షి,సిటీబ్యూరో: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా భావిస్తున్న రాజీవ్ యువ వికాసం పథకం కింద అందించే రుణాల మంజూరుపై మేడ్చల్, మల్కాజిగిరి జిల్లా అధికార యంత్రాంగం కసరత్తు చేస్తోంది. అందులో భాగంగానే యువ వికాసం దరఖాస్తులను వడపోసిన సంబంధిత అధికారులు అర్హుల జాబితాను సిద్ధం చేసే పనిలో నిమగ్నమయ్యారు. రాజీవ్ యువ వికాసం కింద రుణాలకు దరఖాస్తులు చేసుకున్న అర్హులను గుర్తించి తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా జూన్ 2న ఆర్థికసాయం అందించాలని ప్రభుత్వం నిర్ణయించింది. దీంతో అర్హుల జాబితా రూపకల్పనపై ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ శాఖలు మల్లగుల్లాలు పడుతున్నాయి. కులాల వారీగా వచ్చిన దరఖాస్తులను ఇదివరకే పురపాలక సంఘాలు, మండల అధికారులు బ్యాంకర్లకు అందించారు. దరఖాస్తుదారుల సిబిల్ స్కోర్, వివిధ రుణాలు ఏమైనా ఉన్నాయా.. అనే కోణంలో పరిశీలించిన బ్యాంకు అధికారులు సంబంధిత పత్రాలను పురపాలక సంఘాలు, మండల అధికారులకు పంపించారు. బ్యాంకర్లు అందించిన వాటిలో సిబిల్ స్కోర్ కలిగి, అర్హులున్న వారి వివరాలతో కూడిన తుది జాబితాను అధికార యంత్రాంగం సిద్ధం చేసి, జిల్లా ఇన్‌చార్జ్ మంత్రికి త్వరలో నివేదించినట్లు తెలుస్తోంది. ప్రభుత్వం గురువారం వరకు అర్హుల జాబితాను సిద్ధం చేయాలనే ఆలోచనలో ఉన్నా.. ఆ దిశగా పనులు పూర్తయ్యేలా కనిపించడం లేదు.

వర్గీకరణ ఆధారంగానే..

ఎస్సీ వర్గీకరణ నేపథ్యంలో ఆ దిశగానే.. కులాల శాతం ఆధారంగా లబ్ధిదారులను ఎంపిక చేయాలని ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు వచ్చినట్లు సమాచారం. ముందుగా ఎక్కువ శాతం రూ.50 వేల ఆర్థికసాయానికి దరఖాస్తు చేసుకున్న అర్హులను గుర్తించి సాయం అందించాలని ప్రభుత్వం భావిస్తున్నట్లు తెలుస్తోంది.

- రాజీవ్ యువవికాసానికి సంబంధించి ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీశాఖలకు మేడ్చల్, మల్కాజిగిరి జిల్లాలో మొత్తంగా 66,648 దరఖాస్తులు వచ్చాయి. వీటిని బ్యాంకుల వారీగా సిబిల్ స్కోర్ పరిశీలించేందుకు బ్యాంకర్లకు అందించారు. పరిశీలన అనంతరం బ్యాంకర్లు అందించిన వాటిలో అర్హుల జాబితాను పురపాలక సంఘాలు, మండల అధికారులు జాబితా సిద్ధం చేస్తున్నారు. జిల్లా మొత్తంగా 24,610 మంది లబ్ధిదారులకు సాయం అందించాలని సంబంధిత కార్పొరేషన్లకు ఆదేశాలు రావడంతో దీనికనుగుణంగానే జాబితాను తయారు చేస్తున్నారు.
- బ్యాంకులు సిబిల్ స్కోర్ పరిశీలనను ఇంకా పూర్తి చేయలేదని, బుధవారం నాటికి దాదాపు 50 శాతం మేర దరఖాస్తుల సిబిల్ స్కోర్ పరిశీలించిన అధికారులు పురపాలక సంఘాల అధికారులకు పత్రాలను అప్పగించినట్లు తెలుస్తోంది. వీటితో పాటు స్థానికంగా నెలకొన్న రాజకీయ జోక్యం నేపథ్యంలో మరింత ఆలస్యమయ్యే అవకాశం ఉంది.